క్లుప్తంగా

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలను నిర్వహించి భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

బాలల హక్కులపై అవగాహన



కోవూరు : బాలల హక్కులపై కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ ఎస్టీ కాలనీలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు, సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్(ఏహెచ్‌టీయూ) ఏఎస్సై శ్రీహరి బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కాలనీవాసులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఊబిలో చిక్కుకుని పశువుల కాపరి మృతి



మృతి చెందిన చలపతి

కోవూరు : ప్రమాదవశాత్తు ఊబిలో చిక్కుకొని పశువుల కాపరి మృతిచెందిన ఘటన పెన్నా పరీవాహక ప్రాంతమైన కోవూరు మండలం జమ్మిపాళెం వద్ద శనివారం చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు.. జమ్మిపాళెం గ్రామానికి చెందిన బద్దిపూడి చలపతి పశువులు మేపుకునేందుకు పెనా నదిలో వెళ్తుండగా ఊబిలో చిక్కుకున్నారు. వెంటనే సహచర పశువుల కాపరులు ఘటనా స్థలానికి వెళ్లేసరికి చలపతి మృతిచెంది ఉన్నారు. విషయం తెలుసుకున్న వీఆర్వో హరి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి తహసీల్దార్ నిర్మలానందబాబాకు తెలియజేశారు.

అక్రమార్కులపై కఠిన చర్యలకు డిమాండ్

నెల్లూరు (క్రైమ్) : ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. దీన్‌దయాల్‌నగర్‌లో ఇసుక అక్రమ తరలింపు వ్యవహారంలో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావును శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, నారాయణకు చెడ్డపేరు తెచ్చే ఎవరైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు. భారీ యంత్రాలు, జేసీబీలతో కొందరదు రాబంధువులు పెన్నమ్మ గర్భానికి తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనుమతుల మంజూరుకు వినతి

నెల్లూరురూరల్ : పెంచలకోన అభయారణ్యంలో ఇరిగేషన్ కెనాల్ పనులకు అనుమతులు మంజూరు చేయాలని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయంలో బీజేపీ నేత మిడతల రమేష్ వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు మంగళగిరిలోని అరణ్యభవన్‌లో సెక్షన్ ఆఫీసర్‌కు శనివారం ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ఆర్థోపెడిక్ వైద్యశిబిరం నేడు

నెల్లూరు(బృందావనం) : కోటమిట్ట మన్సూర్ నగర్‌లో మసీద్ వద్ద ఉన్న హాజిరా హాస్పిటల్లో ఆదివారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్యశిబిరం జరుగనుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. జమాఅతె ఇస్లామిహింద్ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు.

నెల్లూరు నగరానికి కొత్త మాస్టర్‌ప్లాన్

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరానికి సంబంధించిన జీఐఎస్ ఆధారిత కొత్త మాస్టర్‌ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించిందని కమిషనర్ నందన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఓ నంబర్ 50 ప్రకారంగా కొత్త మాస్టర్ ప్లాన్ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్(హెచ్-2) డిపార్ట్‌మెంట్ ఈఏడాది మార్చి 26వ తేదీన ఆమోదించిందన్నారు. కొత్త మాస్టర్ ప్లాన్‌ను ప్రజలకు తెలియజేసేందుకు ఎన్ఎంసీ కార్యాలయంలో ఫ్లెక్సీ ద్వారా ఏర్పాటు చేశామన్నారు.

అభినందన

నెల్లూరు(బృందావనం) : ప్రపంచ శాస్త్రీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌కాలనీలో ఉన్న డీజే డ్యాన్స్ అకాడమీలో నృత్య పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు, జయప్రకాష్, రఘురామిరెడ్డి, శీనయ్య, డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు ప్రవీణ్‌కల్యాణ్, వంశీ,మేఘన పాల్గొన్నారు.

నిమ్మ రైతు కంట చెమ్మ

- వెంటాడుతున్న కరెంట్ కష్టాలు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటల్లోనే
- వేసవి తాపంతో విలవిల
- తోటలకు నీరు పెట్టేందుకు అదనంగా కూలి ఖర్చు



నిమ్మతోటలో చెట్ల పాదులకు నీటిని పెడుతున్న రైతు

పొదలకూరు: అసలే వేసవి.. ఆపై ఉదయం తొమ్మిది గంటల నుంచి విద్యుత్‌ను సరఫరా చేస్తుండటంతో నిమ్మ రైతులు విలవిల్లాడుతున్నారు. వ్యవసాయ యోగ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందజేయడంతో పాటు తమకు అనుకూలంగా ఉండే వేళలను పాటించాలని వేడుకుంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వేళల్లో వెసులుబాటు కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.

ఐదు వేల ఎకరాల్లో సాగు

మండలంలో నిమ్మ తోటల సాగు అధికంగా ఉంది. దాదాపు ఐదు వేల ఎకరాల్లో సాగులో ఉంది. గత ప్రభుత్వ హయాంలో రైతులు కోరిన వేళల్లో విద్యుత్‌ను అందజేసేవారు. ఆ సమయంలో రైతులు తమ వెతలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు పరిశీలించి సానుకూలంగా స్పందించేవారు. ఎండలు ప్రస్తుతం మండుతున్న తరుణంలో నిమ్మ తోటలకు నీటిని పెట్టుకోవాలనే ఆలోచనతో రైతులు వేసవితాపానికి అల్లాడుతున్నారు. అదనంగా కూలిలు చెల్లిస్తూ తోటల్లో చెట్ల పాదులకు నీటిని పెట్టుకోవాల్సి వస్తోంది.

అనుకూలమైన వేళలతోనే ఊరట

మండలంలో ప్రస్తుతం వ్యవసాయ యోగ్యమైన విద్యుత్‌ను తొమ్మిది గంటల పాటు అందజేస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు సరఫరా చేస్తున్న నేపథ్యంలో సాయంత్రం ఆరు వరకు తోటల్లోనే రైతులు ఉండాల్సి వస్తోంది. ఎండలో వీరి పరిస్థితి దయనీయంగా మారుతోంది. గతంలో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్‌ను సరఫరా చేయడంతో పనిముగించుకొని ఇంటికి చేరి విశ్రాంతి తీసుకునేవారు. అయితే ఇప్పుడు వేసవి తాపానికి తోటల్లోనే ఉండి నీటిని పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. వేసవి తీవ్రత తగ్గేంత వరకైనా వేళల్లో సడలింపులివ్వాలని కోరుతున్నారు. మరోవైపు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉండటంతో నీటిని పెట్టుకోవడంలో రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మధ్యలో గంట పాటు సరఫరా నిలిచిపోతోంది.

వేళల్లో మార్పులు చేయాలి



విద్యుత్ సరఫరా వేళల్లో అధికారులు మార్పులు చేయాలి. ఉదయం ఆరు గంటలకు విద్యుత్‌ను పాత పద్ధతిలోనే అందజేయాలి. వేసవి తాపానికి రైతులు అల్లాడిపోతున్నారు. దీనికితోడు నీరు పెట్టుకోలేని రైతులు రూ.700 కూలి చెల్లించి పాదులకు అందించాల్సి వస్తోంది. మధ్యాహ్నానికి నీటిని పెట్టుకోవడం పూర్తి చేసుకుంటే ఇబ్బంది ఉండదు.

– వెన్నపూస యానాదిరెడ్డి, రైతు, కల్యాణపురం

వడదెబ్బ తగిలే ప్రమాదం



ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేస్తే రైతులు ఇంటికెళ్లే పరిస్థితే ఉండదు. వేసవి తాపానికి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. అధికారులు చొరవ చూపి వేళల్లో మార్పులు చేయాలి. పాత పద్ధతిలోనే అందజేయాలి.

– అట్లా వేణుగోపాల్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

వేడుకగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ట





పొదలకూరు: పట్టణంలో 86 ఏళ్ల నాటి రామమందిరం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణానికి ఉభయకర్తలు, భక్తులు సంకల్పించారు. ఈ తరుణంలో మందిర సమీపంలో బాలాలయాన్ని నిర్మించి అక్కడ ఉత్సవమూర్తులు, సీతారాముల పటాలను శనివారం ప్రతిష్టించారు. ఈ సందర్భంగా హోమం, ప్రత్యేక పూజలను వేద పండితులు నిర్వహించారు. రామాలయాన్ని ఏడాదిలోపు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఉభయకర్తలు కోనం చినబ్రహ్మయ్య, తమ్మల శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు వెల్లడించారు. రామమందిర స్థలంలోనే నిర్మించనున్నామని ప్రకటించారు. ఆదూరు వెంకటసుబ్బయ్య, కన్యకాపరమేశ్వరి దేవస్థాన చైర్మన్ వాకాటి రాఘవులు, పెంచలయ్య, తుమ్మల కిశోర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ టోర్నీ



విజేత జట్టుతో అతిథులు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు మహిళలకు నిర్వహించిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. దేశంలోని వివిధ వర్సిటీల నుంచి 95 జట్లు టోర్నీకి హాజరయ్యాయి. నాకౌట్ మ్యాచ్‌లను శుక్రవారం వరకు నిర్వహించగా, మహర్షి దయానంద్, లవ్లీ ప్రొఫెషనల్, శివాజీ, గురునానక్ దేవ్ వర్సిటీలు తుది దశకు చేరుకున్నాయి. ఈ జట్ల మధ్య మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. అత్యుత్తమ ప్రతిభ చూపిన శివాజీ యూనివర్సిటీ (కొల్హాపూర్), లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (పంజాబ్), మహర్షి దయానంద్ యూనివర్సిటీ (రోహతక్) మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. పురుషుల టోర్నీ ఆదివారం నుంచి ఈ నెల 8 తేదీ వరకు జరగనుంది. విజేతలకు వీఎస్‌యూ క్రీడా ప్రాంగణంలో బహుమతులను అందజేశారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, వీఎస్‌యూ, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వీసీలు అల్లం శ్రీనివాసరావు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలకు ప్రోత్సాహం అవసరం



కొడవలూరు గ్రంథాలయంలో..



విడవలూరులో..

కొడవలూరు: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని లైబ్రేరియన్ కె.రాజేశ్వరి పిలుపునిచ్చారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా కొడవలూరులోని గ్రంథాలయంలో విద్యార్థులతో కఠిన పదాలు, పజిల్స్ బోర్డుపై శనివారం ప్రాక్టీస్ చేయించారు. తదుపరి ఆట విడుపుగా విద్యార్థులతో కేరమ్స్ ఆడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలోని వేసవి శిబిరాలకు రావడం వల్ల ఎండల బారిన పడకుండా ఉండడంతో పాటు వివిధ రంగాల్లో విజ్ఞానం పెంపొందించుకుంటారని చెప్పారు. పిల్లలను శిబిరాలకు పంపేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

విడవలూరు: పిల్లలు విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని లైబ్రేరియన్ టి.నిరూప అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం ఆమె పిల్లలకు పిల్లలకు పుస్తక పఠనం ఆవశ్యకతను వివరించారు. అనంతరం కథలు, పుస్తక సమీక్ష, డ్రాయింగ్, ఆటల పోటీలను నిర్వహించారు. వేసవిలో నిర్వహించే విజ్ఞాన శిబిరాన్ని పిల్లలంతా సద్వినియోగం చేసుకోవాలని, వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని పిల్లల తల్లితండ్రులను కోరారు.

రాష్ట్రంలో 18 చోట్ల డయాలసిస్ కేంద్రాలు



రోగితో మాట్లాడుతున్న సత్యకుమార్

పొదలకూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 18 చోట్ల డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పొదలకూరు సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఐదు పడకల డయాలసిస్ కేంద్రాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు. వెంకటగిరిలో త్వరలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గుండెపోటుకు గురైన గోల్డెన్ అవర్‌లో ఇచ్చే ఖరీదైన ఇంజెక్షన్లను సీహెచ్‌సీలో ఉంచామని, ఇప్పటి వరకు 2800 మందిని కాపాడగలిగామని తెలిపారు. ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ నేత సురేంద్రరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మస్తాన్‌బాబు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచితంగా ప్రైవేట్ విద్య

పొదలకూరు: విద్యాహక్కు చట్టం మేరకు మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలను కల్పించనున్నామని ఎంఈఓ రేణుక శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ప్రైవేట్ పాఠశాలల్లో కల్పించనున్నామని వెల్లడించారు. దీనికి సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 19 వరకు స్వీకరించనున్నామని చెప్పారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి వార్డు సచివాలయాల డేటా ఆధారంగా అర్హతలను నిర్ణయించనున్నామని పేర్కొన్నారు. లాటరీ విధానంలో మొదటి విడత ప్రవేశాలను 29న వెల్లడించనున్నామని, సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాలను జూన్ 8న ఖరారు చేయనున్నామని ప్రకటించారు. రెండో విడత ఫలితాలను అదే నెల 18న విడుదల చేయనున్నామని, ఆసక్తి గల వారు వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఎంఈఓ కార్యాలయం లేదా సచివాలయాలను సంప్రదించాలని సూచించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

కొడవలూరు: కొడవలూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో మూడో తరగతిలో చేరికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.దేవసహాయం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతిలో 40 సీట్లకు 32 సీట్లు ఎస్టీలకు, ఐదు సీట్లు ఎస్సీలకు, రెండు సీట్లు బీసీలకు, ఒక సీటు ఓసీకి కేటాయించినట్లు తెలియజేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐటీడీఏ పీఓ సమక్షంలో లాటరీ నిర్వహించి సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. అదేవిధంగా నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ సీట్లను ఎస్టీ విద్యార్థులతోనే భర్తీ చేస్తామని చెప్పారు. వీటికి ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అగ్నిప్రమాదాల్లో జాగ్రత్తలపై శిక్షణ

వెంకటాచలం: అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే అంశమై మండలంలోని అక్షర విద్యాలయలో శిక్షణ కార్యక్రమాన్ని 10 ఆంధ్రా నావల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఫైర్‌మెన్ రాజేంద్రప్రసాద్, ఇలియాజ్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి పూజలు



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పూజలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

మాజీ మంత్రి ప్రసన్న పరామర్శ



రఫీ కుటుంబసభ్యులతో ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పోలినాయుడు చెరువుపల్లి గ్రామంలో ఇటీవల హత్యకు గురైన పెద్దరఫీ కుటుంబాన్ని కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. హత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టౌన్, రూరల్ కన్వీనర్లు షాహుల్, సతీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, అల్లాభక్షు, భరత్ పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్‌రెడ్డి

ఇందుకూరుపేట: చెత్త నుంచి సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించి సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ శ్రీధర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి క్రమం తప్పకుండా చెత్తను సేకరించాలన్నారు. పన్ను వసూళ్లలో లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా వేసవి కాలం కావడంతో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన సుబ్బారెడ్డికి సపర్యలు చేస్తున్న స్థానికులు

కొడవలూరు : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నార్తురాజుపాళెం జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకొంది. నార్తురాజుపాళేనికి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి స్థానిక బ్రహ్మయ్య కళాశాల వద్ద హైవేపై రోడ్డు పక్కన నడుచుకొంటూ వెళ్తుడగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుబ్బారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందించారు. సుబ్బారెడ్డిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం అందాల్సి ఉంది.

శోభాయమానంగా విగ్రహ ప్రతిష్ట



ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం మజారా పల్లిపాళెం గ్రామంలో సీతారామ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కొత్తూరు లలితా మహేశ్వరి ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేడుకను పూర్తి చేశారు. ఈ సందర్భంగా హోమాలు, మహా పూర్ణాహుతి, కలశ స్థాపన జరిపారు. మహాకుంభాభిషేకం మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణం అత్యంత వేడుకగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పొట్టేళ్ల మందపై కుక్కల దాడి



మృతి చెందిన పొట్టేళ్లు

కోవూరు : మండల పరిధిలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో శనివారం వేకువజామున పొట్టేళ్ల మందపై వీధికుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన పామర్తి శ్రీనివాసులు తన ఇంటి వద్ద ఉన్న దొడ్లో పొట్టేళ్లను కట్టేసి ఉండగా కుక్కలు దాడి చేశాయి. ఇందులో 14 పొట్టేళ్లు మృతిచెందినట్లు యజమాని తెలిపారు. రూ.70 వేల నష్టం వచ్చినట్లు ఆయన వాపోయారు.

మార్కెట్ దుకాణాల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ దుకాణాలను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శనివారం పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం పందుల పెంపకందారులతో మాట్లాడారు. పట్టణంలోనే అనువైన స్థలాన్ని గుర్తించి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట చైర్‌పర్సన్ సుప్రజ తదితరులు ఉన్నారు.

ఏడున మండల సర్వసభ్య సమావేశం

వెంకటాచలం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల ఏడో తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ కల్పన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖలపై సమీక్షించనున్నారని, మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కొడవలూరు : ప్రతి సోమవారం జరిగే మండల స్థాయి గ్రీవెన్స్‌డేలో వచ్చే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యలను వంద శాతం పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. మండల స్థాయి గ్రీవెన్స్‌కు అన్నిశాఖల అధికారులు హాజరవుతున్నందున ఎలాంటి సమస్యలున్నా తెలుపుకుని పరిష్కరించుకోవాలని కోరారు.